సాక్షి
విశాఖపట్నం
మంగళవారం : 21 : జనవరి : 2025



అర్జీల రీ ఓపెన్‌పై కలెక్టర్ ఆగ్రహం 8లో



స్పీడ్ బోటుపై రయ్‌రయ్ 8లో



జీతాలు చెల్లించాలని గెస్ట్ ఫ్యాకల్టీల ఆందోళన 8లో

ఫిట్‌నెస్‌లో అన్నీ ఫిట్టింగులే..!



జీవీఎంసీ వాహనాల ఫిట్‌నెస్ ట్యాక్స్‌లో గోల్‌మాల్

- వాహనాలు మరమ్మతుకు రావడంతో బండారం బట్టబయలు
- జీవీఎంసీ ఖజానాకు రూ.50 లక్షల కన్నం
- నిధుల మళ్లింపులో డీఈ దిలీప్ కీలక సూత్రధారి
- కూటమి నేతల ఒత్తిళ్లతో షోకాజులతో సరి
- పైగా జోన్–1 ఈఈగా పదోన్నతి.. కాపులుప్పాడలో కొత్త పోస్టు
- కలర్ జిరాక్సులతో రోడ్ ట్యాక్స్ నిధులూ మళ్లింపు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

జీవీఎంసీ వాహనాల ఫిట్‌నెస్ ట్యాక్స్ చెల్లింపులో గోల్‌మాల్ జరిగింది. ఈ నిధులను పక్కదారి పట్టించారు. ఇందులో సంబంధిత ఏజెన్సీతోపాటు జీవీఎంసీలో మెకానికల్ సెక్షన్ డీఈ దిలీప్ కీలకపాత్ర పోషించినట్లు తెలుస్తోంది. మొత్తం 430 వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల కోసం రూ.70 లక్షల మేర జీవీఎంసీ నుంచి ఏజెన్సీకి చెల్లించగా.. కేవలం రూ.30 లక్షల మేర మాత్రమే ట్యాక్స్ చెల్లించి మిగిలిన మొత్తాన్ని మళ్లించేశారు. గత ఏడాది జీవీఎంసీకి చెందిన ఆరు వాహనాలు మరమ్మతుకు గురయ్యాయి. ఈ వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకపోవడంతో ఇన్సూరెన్స్ వర్తించదంటూ బీమా కంపెనీ తేల్చిచెప్పింది. దీంతో బాగోతం బయటపడింది. ఈ నేపథ్యంలో ఈ వాహనాలకు రూ.50 లక్షల మేర జీవీఎంసీ నిధులతో మరమ్మతులు చేశారు. అంతే కాకుండా రోడ్ ట్యాక్స్ చెల్లింపులోనూ జీవీఎంసీ నుంచి నిధులు బొక్కేసినట్టు తేలింది. దీంతో పెనాల్టీతో కలిపి రోడ్ ట్యాక్స్ జీవీఎంసీ చెల్లించాల్సి వచ్చింది. ఈ వ్యవహారంలో కూడా దిలీప్ వైపే వేళ్లన్నీ చూపుతున్నాయి. విచిత్రంగా ఈ నిధుల మళ్లింపులో కేవలం ఏజెన్సీపై మాత్రమే కేసు నమోదు చేసి.. కిందిస్థాయి ఉద్యోగి వర్క్ ఇన్‌స్పెక్టర్‌పై చర్యలు తీసుకొని.. మెకానికల్ ఈఈగా అప్పట్లో ఉన్న దిలీప్‌ను, సెక్షన్‌ను మాత్రం తప్పించారు. కూటమి నేతల ఒత్తిళ్లతోనే దిలీప్‌పై చర్యలు తీసుకునేందుకు జీవీఎంసీ అధికారులు వెనుకంజ వేసినట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. పైగా డీఈ పోస్టును సృష్టించి కాపులుప్పాడకు బదిలీ చేయడంతో పాటు ఏకంగా పదోన్నతి ఇచ్చి జోన్–1 ఇన్‌చార్జి ఈఈగా నియమించడం గమనార్హం.

వాహనాలు ఆగిపోవడంతో..

జీవీఎంసీలో ఆయా డిపార్ట్‌మెంట్‌లకు మొత్తం 430 వాహనాలున్నాయి. ఈ వాహనాలకు ఏటా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఫిట్‌నెస్ ట్యాక్స్‌ను నేరుగా జీవీఎంసీ కాకుండా ఆర్టీఏ ఏజెంట్ మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. దీంతో లైసెన్స్ ఉన్న ఆర్టీఏ ఏజెంట్ ద్వారా ఏటా ఫిట్‌నెస్ ట్యాక్స్ చెల్లిస్తున్నారు. 2024–25కు సంబంధించిన ఫిట్‌నెస్ ట్యాక్స్‌ను చెల్లించేందుకుగాను సదరు ఏజెంట్ అకౌంట్‌లో రూ.70 లక్షల మేర నిధులను జీవీఎంసీ మళ్లించింది. ఆ మొత్తాన్ని వెంటనే ఫిట్‌నెస్ ట్యాక్స్ కోసం చెల్లించి, ఆ కాగితాలను జీవీఎంసీకి ఇవ్వాల్సి ఉంది. ఈ వ్యవహారాలన్నీ జీవీఎంసీలో మెకానికల్ సెక్షన్ చూసే ఈఈ పర్యవేక్షిస్తుంటారు. ఇందుకు భిన్నంగా జీవీఎంసీ నుంచి తన అకౌంట్‌లోకి వచ్చిన నిధుల్లో నుంచి కేవలం రూ.30 లక్షలు మాత్రమే ట్యాక్స్ కోసం చెల్లించి... మిగిలిన నిధులను సొంతానికి వాడుకున్నారు. అయితే, కలర్ జిరాక్సులు పెట్టి వ్యవహారం నడిపిద్దామనుకునే సమయానికి ఇందులో ఆరు వాహనాలు యాక్సిడెంట్‌కు గురై రిపేరుకు వచ్చాయి. వీటికి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ (ఎఫ్‌సీ) లేకపోవడంతో ఇన్సూరెన్స్ వర్తించదని బీమా కంపెనీ తేల్చిచెప్పింది. దీంతో రూ.50 లక్షలతో వీటికి మరమ్మతులు చేయించారు. దీంతో అసలు బండారం బయటకు వచ్చింది. మరోవైపు చెత్త తరలింపు హుక్ లోడర్ వాహనం కూడా గత 8 నెలలుగా టాటా షోరూంలోనే ఉంది. దీనికి కూడా ఎఫ్‌సీలు, ఇన్సూరెన్స్ లేకపోవడంతోనే మరమ్మతు చేయించకుండా నిలిచిపోయినట్టు తెలుస్తోంది. యాక్సిడెంట్‌కు గురైన జీవీఎంసీకి చెందిన వాహనాలకు గత 8 నెలల కాలంలో ఒక్క రూపాయి కూడా ఇన్సూరెన్స్ క్లెయిమ్ కాలేదంటే ఏ స్థాయిలో ఈ గోల్‌మాల్ జరిగిందనేది ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

కలర్ జిరాక్సులతో కలరింగ్

రోడ్ ట్యాక్స్ వ్యవహారంలోనూ కలర్ జిరాక్సులతో కలరింగ్ ఇచ్చినట్టు తెలుస్తోంది. ఒక బండికి చలానా చట్టి... అదే చలానా కలర్ జిరాక్స్ తీసి ఇతర వాహనాలకు కూడా రోడ్ ట్యాక్స్ చెల్లించేసినట్టు జీవీఎంసీలో రికార్డులు సృష్టించారు. ఇందుకు అనుగుణంగా ట్యాక్స్ మొత్తాన్ని జీవీఎంసీ ఖజానా నుంచి సదరు ఏజెన్సీ లాగేసుకుంది. రవాణాశాఖ అధికారుల వద్ద రికార్డుల్లో కొన్ని వాహనాలకు రోడ్ ట్యాక్స్ కట్టినట్టు ఉంది. మిగతా వాహనాలకు రోడ్ ట్యాక్స్‌తోపాటు పెనాల్టీ కూడా చెల్లించాలని రవాణాశాఖ నోటీసులు జారీచేసింది. దీంతో పెనాల్టీలను కలుపుకుని మరీ జీవీఎంసీ ఖజానా నుంచి అధికారులు చెల్లించాల్సి వచ్చింది. అయితే, సదరు ఏజెన్సీతో పాటు ఏమాత్రం సంబంధం లేని కిందిస్థాయి ఉద్యోగి వర్క్ ఇన్‌స్పెక్టర్‌ను బలిచేశారన్న ఆరోపణలున్నాయి. మరోవైపు అప్పటివరకు మెకానికల్ సెక్షన్ చూస్తున్న ఇన్‌చార్జి ఈఈ దిలీప్‌కు కేవలం షోకాజ్ నోటీసులతో వ్యవహారం కప్పిపెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పైగా మెకానికల్ సెక్షన్‌లో అవసరం లేకపోయినప్పటికీ అక్కడే పోస్టును సృష్టించి కాపులుప్పాడ ఇన్‌చార్జి డీఈగా నియమించారు. అంతటితో ఆగకుండా జోన్–1కు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా (ఎఫ్ఏసీ) కూడా నియమించడంలో కూటమి నేతల ఒత్తిళ్లు ఉన్నాయన్న ఆరోపణలున్నాయి.

న్యూస్‌రీల్

గ్రేహౌండ్స్ డీఐజీగా అట్టాడ బాపూజీ

డీసీపీ(అడ్మిన్)గా కృష్ణకాంత్ పటేల్



విశాఖ సిటీ: గ్రేహౌండ్స్ డీఐజీగా అట్టాడ బాపూజీ నియమితులయ్యారు. ఇక్కడ ఏడీజీగా విధులు నిర్వర్తిస్తున్న రాజీవ్‌కుమార్ మీనాను ఎస్ఎల్‌పీఆర్‌బీ చైర్మన్‌గా నియమించారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే విశాఖ పోలీస్ కమిషనరేట్ పరిధిలో తొలిసారిగా డీసీపీ (అడ్మిన్) పోస్టును భర్తీ చేశారు. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న 2018 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన కృష్ణకాంత్ పటేల్‌ను డీసీపీ(అడ్మిన్)గా నియమితులయ్యారు.

ద్వారకా జోన్ ఏసీపీగా నరసింహమూర్తి



సీతమ్మధార : ద్వారకా జోన్ ఏసీపీగా అన్నెపు నరసింహమూర్తి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఆయన వెస్ట్ ఏసీపీగా పనిచేయడం తెలిసిందే. కాగా, కొంతకాలంగా ద్వారకా జోన్ ఏసీపీ పోస్టు ఖాళీగా ఉండడంతో ఆయన ఇదే సబ్ డివిజన్ ఇన్‌చార్జి ఏసీపీగా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పుడు పూర్తిస్థాయి ఏసీపీగా నియమితులు కావడం విశేషం. 1991 బ్యాచ్‌కి చెందిన అన్నెపు నరసింహమూర్తి సీఐగా 2004లో పదోన్నతి పొందారు. ఏసీపీగా 2014లో పదోన్నతి పొందారు.

వెస్ట్ ఏసీపీగా పృథ్వితేజ బాధ్యతల స్వీకరణ



గోపాలపట్నం: వెస్ట్ సబ్ డివిజన్ఏసీపీగా ఏబి పృథ్వితేజ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 2022 గ్రూప్–1 బ్యాచ్‌కు చెందిన ఆయన శిక్షణ పూర్తికాగానే తొలి పోస్టింగ్ పొందారు. ఇంతవరకు ఇక్కడ ఏసీపీగా పనిచేసిన నరసింహమూర్తి ఆయనకు బాధ్యతలు అప్పగించారు.

జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి మాధవి బదిలీ

మహారాణిపేట : జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి, డిప్యూటీ డైరెక్టర్ ఎస్.జె.మాధవి బదిలీ అయ్యారు. ఈ మేరకు అధికారికంగా ఉత్తర్వులు వెలువడ్డాయి. భీమిలి డీఎల్‌డీవోగా కె.హరిప్రసాద్‌రావు నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన ఏపీఐఐసీ అనకాపల్లి జోనల్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. విశాఖ డుమా అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.రోజారాణిని విజయనగరం డీఎల్‌డీవోగా బదిలీ చేశారు.

నేటి నుంచి కుష్టువ్యాధిగ్రస్తుల గుర్తింపు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

మహారాణిపేట : ఈనెల 20 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు జిల్లాలోని అన్ని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే ప్రత్యేక కార్యక్రమం చేపట్టనున్నారు. ఈ మేరకు ప్రత్యేక పోస్టర్‌ను కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం అమలు చేసేందుకు జిల్లాలో 951 టీమ్‌లు వేశామని, వీరు ఇంటింటికి వెళ్లి అనుమానితులను గుర్తించి, సమీపంలో యూపీహెచ్‌సీకి తీసుకెళ్లి పరీక్షలు నిర్వహిస్తారని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు చెప్పారు. ఈ ఏడాది ఇప్పటి వరకు జిల్లాలో 85 కుష్టువ్యాధి గ్రస్తులను గుర్తించామని, వీరికి ఉచితంగా చికిత్స అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ నివారణాధికారి డాక్టర్ జి.పూర్ణేంద్రబాబు, కేజీహెచ్ ఆర్ఎంవో డాక్టర్ దవళ భాస్కరరావు, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ అప్పారావు పాల్గొన్నారు.

24న జాబ్‌మేళా

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీయర్ సర్వీస్ సెంటర్‌లో ఈనెల 24న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా సబ్ రీజినల్ ఎంప్లాయ్‌మెంట్ అధికారి నిట్టాల శ్యామ్ సుందర్ తెలిపారు. విప్రో సోల్యూషన్స్, అప్టోటెక్ స్టీల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థల్లో అసిస్టెంట్ మేనేజర్, సేల్స్ మేనేజర్, టీమ్ లీడర్, కెమిస్ట్, కస్టమర్ ఎగ్జిక్యూటివ్, సేల్స్ ఆఫీసర్, టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఎంబీఏ, ఎంసీఏ ఉత్తీర్ణత సాధించి 18–35 ఏళ్ల వయసు గల అభ్యర్థులు అర్హులన్నారు. ఆయా ఉద్యోగాన్ని బట్టి జీతం సంవత్సరానికి రూ.1.8 లక్షలు నుంచి రూ.3.6 లక్షలు వరకు ఉంటుందన్నారు.

జీవీఎంసీ కమిషనర్ బదిలీ



విశాఖ సిటీ: జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్ బదిలీ అయ్యారు. ఆయన కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే జీవీఎంసీ కమిషనర్‌గా ఎవరిని నియమించలేదు. 2016 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన సంపత్‌కుమార్ 2024, జూలై 23వ తేదీన జీవీఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. నగరాభివృద్ధితో పాటు, ప్లాస్టిక్ నివారణ, ప్రాజెక్టులు, ఇతర అంశాలపై ప్రత్యేక దృష్టిసారించారు. నగర సుందీకరణతో పాటు, జాతీయ, అంతర్జాతీయంగా చేపట్టిన పలు కార్యక్రమాల్లో ఎటువంటి ఇబ్బంది లేకుండా విధులు నిర్వహించారు. తాజాగా ఆయన్ని సీడీఎంఏగా ప్రభుత్వం బదిలీ చేసింది.

జకార్తా చేరుకున్న ఐఎన్ఎస్ ముంబై



ఐఎన్ఎస్ ముంబై

సింధియా: మల్టీ నేషనల్ ఎక్సర్‌సైజ్ లాపెరోస్ ఎడిషన్‌లో పాల్గొనేందుకు ఆగ్నేయ మహాసముద్ర ప్రాంతంలో మోహరించిన స్వదేశీ విధ్వంసక నౌక ఐఎన్ఎస్ ముంబై ఇండోనేషియాలోని జకార్తా చేరుకుంది. ఈ వ్యాయామంలో రాయల్ ఆస్ట్రేలియా నేవీ, ఇండోనేషియా నేవీ, రాయల్ మలేషియన్ నేవీ, రిపబ్లిక్ ఆఫ్ సింగపూర్ నేవీ, రాయల్ కెనడియన్ నేవీల నుంచి పలు షిప్‌లు పాల్గొంటాయి. సముద్ర నిఘాతో, పరస్పర సహకారంతో సముద్రంలో అనుకూల పరిస్థితులను అభివృద్ధి చేయడమే ఈ ఎక్సర్‌సైజ్ ప్రధాన ఉద్దేశమని నేవీ వర్గాలు తెలిపాయి.

ప్లాస్టిక్ ఫ్రీ సిటీగా విశాఖ

- సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధానికి సహకరించండి
- ఓ యజ్ఞంలా ప్లాస్టిక్ నియంత్రణ
- 'సాక్షి'తో జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్



'ప్లాస్టిక్ రహిత నగరంగా విశాఖను చూడాలి. దీనికి ప్రజల సహకారం చాలా అవసరం. ప్రపంచాన్ని శాసిస్తున్న ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టేందుకు ప్రతి ఒక్కరూ నిషేధాన్ని యజ్ఞంలా భావించాలి. భావితరాలకు మంచి భవిష్యత్తు అందించాలి. ప్లాస్టిక్ అనర్థాలపై ఐదేళ్లుగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాం. జనవరి ఒకటి నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాం. ప్రత్యామ్నాయ వస్తువులను వాడాలని సూచిస్తున్నాం. నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, అధికార యంత్రాంగంతో కలిసి ఇప్పటికే కార్యాచరణ చేపట్టాం. ప్రజల్లో క్రమంగా మార్పు వస్తోంది. ప్లాస్టిక్ నియంత్రణలో ప్రజలూ భాగస్వామ్యం కావాలి' అని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ అన్నారు. ఆయన సోమవారం 'సాక్షి'తో మాట్లాడారు.

డాబాగార్డెన్స్ : ప్లాస్టిక్ నిషేధానికి ఆరు దశల్లో చర్యలు చేపట్టాం. ముఖ్యంగా రీసైక్లింగ్‌కు సాధ్యం కాని ప్లాస్టిక్ నిషేధానికి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాం. 120 మైక్రాన్ల మందం కన్నా తక్కువ ఉన్న..రీసైక్లింగ్‌కు సాధ్యం కాని ప్లాస్టిక్‌ను నిషేధించాం. దాదాపు ఎనిమిది వారాల పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. జీవీఎంసీ పరిధిలో 55 వేల దుకాణాలు..33 వేల మంది స్ట్రీట్ వెండర్స్ ఉన్నారు. వారందర్నీ జీవీఎంసీ అధికారులు, సిబ్బంది నేరుగా కలిసి నిషేధిత ప్లాస్టిక్‌పై సూచనలు..ఆదేశాలిచ్చారు. విశాఖ మహానగరానికి నిత్యం 15 టన్నుల ప్లాస్టిక్ వస్తోంది. ఎక్కువగా విజయనగరం జిల్లా నుంచి వస్తోంది. ఆ ఉత్పత్తిని కంట్రోల్ చేసేందుకు విజయనగరం జిల్లా కలెక్టర్‌తో మాట్లాడాం. ప్లాస్టిక్ నియంత్రణలో జీవీఎంసీ 3వ దశలో ఉంది. ప్లాస్టిక్ ఫ్రీ సిటీగా విశాఖను దేశంలోనే నంబర్ వన్‌గా నిలిపేందుకు అనేక చర్యలు చేపడతున్నాం.

నియంత్రణకు కమిటీలు

నిషేధిత ప్లాస్టిక్ నియంత్రణకు కమిటీలు వేశాం. వార్డు, జోనల్ స్థాయి, జీవీఎంసీ స్థాయిలో కమిటీలు వేసి ఎప్పటికప్పుడు ఆదేశాలివ్వడం జరుగుతోంది. ప్రజల అవగాహనతోనే నియంత్రణ ముడిపడి ఉంది. టోటల్ ప్లాస్టిక్ బ్యాన్ కాలేదు. 120 మైక్రాన్ల మందంలోపు ప్లాస్టిక్‌ను నియంత్రిస్తున్నాం. జీవీఎంసీ పరిధిలో 330 కిలోమీటర్ల మేర 1.2 మీటర్ల వెడల్పున కాలువలున్నాయి. 3 మీటర్ల ఎత్తులో మెస్‌లు ఏర్పాటు చేస్తున్నాం. ప్రజల్లో మార్పు వస్తుందని ఆశిస్తున్నాం.

డోర్ టు డోర్ క్యాంపైన్..

ఇక నుంచి ప్రతి నెలా 15 రోజుల పాటు డోర్ టు డోర్ క్యాంపైన్ నిర్వహించనున్నాం. అందుకు సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్..శానిటరీ సిబ్బందిని భాగస్వామ్యం చేస్తున్నాం.

నిబంధనలు మీరితే..

నిబంధనలు మీరి సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగించే చిరు వ్యాపారులకు మొదటి సారి రూ.2,500, రెండోసారి రూ.5వేలతో పాటు వారి ట్రేడ్ లైసెన్స్ రద్దు చేస్తాం. జీఎస్టీ పరిధిలోని వ్యాపారస్తులు మొదటిసారి పట్టుబడితే రూ.20వేలు, రెండోసారి పట్టుబడితే రూ.40వేలు, వ్యాపార లైసెన్స్ రద్దు చేసి.. కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

సోషల్ మీడియా ద్వారా..

సోషల్ మీడియా ద్వారా ప్రజలకు విస్తృత ప్రచారం చేస్తున్నాం. ఇప్పటికే సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లతో సమీక్షించాం. ప్లాస్టిక్ వస్తువులకు బదులుగా ప్రత్యామ్నాయమైన స్టీల్, గాజు, పింగాణి, పేపర్, వస్త్ర, నార వస్తువులు వినియోగించేలా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నాం.

పాఠశాల విద్యలో మార్పులపై సమీక్ష

విశాఖ విద్య : పాఠశాల విద్యలో తీసుకొస్తున్న సమూల మార్పులపై ఆ శాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు సోమవారం సమీక్ష నిర్వహించారు. ఆంధ్ర యూనివర్సిటీ అంబేడ్కర్ అసెంబ్లీ హాల్లో సోమవారం జరిగిన వర్క్‌షాప్‌నకు విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విజయనగరం జిల్లాల కలెక్టర్లు హరేందిర ప్రసాద్, విజయకృష్ణన్, దినేష్ కుమార్, అంబేడ్కర్‌తో పాటు, విద్యాశాఖ ఆర్జేడీ విజయభాస్కర్, నాలుగు జిల్లాల డీఈవోలు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా గత ప్రభుత్వం తీసుకొచ్చిన 117 జీవోను కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. కొత్తగా మోడల్ స్కూళ్ల ఏర్పాట్లు, క్లస్టర్ విధానం అమలు, యూపీ స్కూళ్లను సమీప హైస్కూళ్లలో విలీనానికి ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో ఈ వర్క్‌షాప్ నిర్వహించారు. తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ దిశా నిర్దేశం చేసినట్లు తెలిసింది.

'ప్రత్యేక' ప్రక్షాళన షురూ..!

- స్పెషల్ బ్రాంచ్‌ను కుదిపేస్తున్న బెట్టింగ్ కేసు
- సీపీ సీరియస్.. రహస్య విచారణ
- ఇటీవలే ఎస్‌బీ నుంచి పలువురికి ఉద్వాసన
- తాజాగా 11 మంది ఆయా స్థానాల్లో పోస్టింగ్‌లు



విశాఖ సిటీ : క్రికెట్ బెట్టింగ్ వ్యవహారం 'స్పెషల్ బ్రాంచ్'ను కుదిపేస్తోంది. ఈ కేసులో ఎస్‌బీ సిబ్బంది పాత్ర.. పోలీస్ శాఖలో ప్రకంపనలు రేపుతోంది. ఈ వ్యవహారంపై నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సీరియస్‌గా ఉన్నారు. దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు. స్పెషల్ బ్రాంచ్ ప్రక్షాళనపై దృష్టి పెట్టారు. ఇప్పటికే ఎస్‌బీలో దీర్ఘకాలంగా విధులు నిర్వర్తిస్తున్న వారికి ఆ విభాగం నుంచి ఉద్వాసన పలికారు. తాజాగా అయా స్థానాల్లో ఇతర స్టేషన్లలో పనిచేస్తున్న ఒక ఏఎస్ఐ, ఐదుగురు హెడ్‌కానిస్టేబుళ్లు, ముగ్గురు కానిస్టేబుళ్లకు పోస్టింగ్‌లు ఇచ్చారు. త్వరలోనే ఇతర అధికారులపై కూడా బదిలీ వేటు పడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

తవ్వుతున్నకొద్దీ..

క్రికెట్ బెట్టింగ్ కేసును సీపీ సీరియస్‌గా తీసుకున్నారు. ఇప్పటికే ఈ కేసులో ఎనిమిది మందిని అరెస్టు చేశారు. పెదవాల్తేర్ డాక్టర్స్ కాలనీలో ఒక నిందితుడిని పట్టుకొని విచారించగా భారీ బెట్టింగ్ వ్యవహారం బట్టబయలైంది. ఇప్పటివరకు పోలీసులు గుర్తించిన దాని ప్రకారం ఈ బెట్టింగ్ ద్వారా రూ.176 కోట్ల మేర లావాదేవీలు జరిగినట్లు తెలుస్తోంది. ఇంకా అనేక బ్యాంక్ ఖాతాలను సైబర్ క్రైమ్ పోలీసులు పరిశీలిస్తున్నారు. దేశ, విదేశాల్లో ఈ బెట్టింగ్ రాకెట్ విస్తరించి ఉన్నట్లు పోలీసుల దర్యాప్తుల్లో వెల్లడైంది. ఇదిలా ఉంటే.. ఇందులో కూటమి నేతల హస్తం ఉన్నట్లు కూడా వార్తలు వినిపిస్తున్నాయి. అదే విధంగా పోలీస్ శాఖలో పలువురు ఈ బెట్టింగ్ రాకెట్‌కు సహకారం అందించారన్న ఆరోపణలు ఉన్నాయి.

పోలీసులూ.. బెట్టింగ్ బాధితులే!

ఈ బెట్టింగ్ భూతానికి పలువురు పోలీసులు సైతం బలైనట్లు తెలుస్తోంది. ఈ బెట్టింగ్‌లకు సహకరించిన వారిని పక్కన పెడితే.. కొంత మంది సిబ్బంది ఈ బెట్టింగ్‌లకు పాల్పడి.. రూ.లక్షలు పోగొట్టుకున్నారు. ప్రధానంగా ఏఆర్‌తో పాటు ఇతర విభాగాలకు చెందిన పలువురు సిబ్బంది ఈ బెట్టింగ్ దెబ్బకు భారీగా నష్టపోయినట్లు ఉన్నతాధికారుల దృష్టికి కూడా వెళ్లింది.

రహస్య విచారణ?

క్రికెట్ బెట్టింగ్ వ్యవహారంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాత్రపై నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి రహస్యంగా విచారణ చేయిస్తున్నట్లు పోలీస్ శాఖలో చర్చ జరుగుతోంది. ఒక అధికారితో పాటు కొందరు సిబ్బంది కాల్ డేటాను విశ్లేషిస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. కొందరు సిబ్బంది కూటమి ఎమ్మెల్యేలకు వాటాలు సైతం అందించారన్న ఆరోపణల నేపథ్యంలో వాటిపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఫలితంగానే వారిని ఈ కేసుకు సంబంధించి దర్యాప్తు, కీలక సమీక్షలకు దూరం పెడుతున్నారన్నట్లు సిబ్బంది చెవులు కొరుక్కుంటున్నారు. ఇందులో భాగంగానే ఇటీవల జరిగిన టెలీ కాన్ఫరెన్స్‌కు ఒక అధికారిని దూరం పెట్టినట్లు చెప్పుకుంటున్నారు. ఏదేమైనప్పటికీ.. పోలీసులు ఛేదించిన క్రికెట్ బెట్టింగ్ కేసులో ఆ శాఖకు చెందిన పలువురి పాత్ర ఉన్నట్లు వస్తున్న ఆరోపణలు ఆ శాఖాధికారులకు తలనొప్పిగా మారింది.

డబ్బులు చెల్లిస్తేనే.. భోజనం!

- ఏయూ హాస్టళ్లలో వింత పోకడలు
- స్కాలర్‌షిప్‌లు మంజూరుకాక ఇబ్బందులు
- విద్యార్థులపైనే మెస్, విద్యుత్ బిల్లుల బారం
- అధికారుల తీరుపై విద్యార్థుల నిరసన గళం
- వైస్ చాన్సలర్ భవనం ముందు ధర్నా



నినాదాలు చేస్తున్న ఏయూ విద్యార్థులు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో చదువులు ఫ్రీ అనుకుని చేరితే, ఇక్కడ డబ్బులు కడితేనే కానీ హాస్టళ్లలో భోజనం పెట్టడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్సిటీ అధికారులకు తమ గోడువెళ్లబోసుకున్నా.. పరిష్కారం దొరక్కపోవటంతో నిరసనకు దిగారు. ఆర్ట్స్ అండ్ సైన్సు కోర్సులు అభ్యసించే హాస్టళ్ల విద్యార్థులు సోమవారం వర్సిటీలోని వైస్ చాన్సలర్(వీసీ) భవనం ముందు ధర్నా నిర్వహించారు. తమ సమస్యలను పరిష్కరించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పదుల సంఖ్యలో విద్యార్థులంతా వీసీ భవనం ముందు బైఠాయించటంతో విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఆందోళన విరమించాలని సూచించినా, వర్సిటీ అధికారులు వచ్చి, స్పష్టమైన హామీ ఇచ్చాకే, అక్కడి నుంచి లేస్తామని తెగేసి చెప్పారు. విద్యార్థుల ఆందోళనతో వర్సిటీ అధికారులు దిగివచ్చారు. రిజిస్ట్రార్ ధనుంజయరావు ఆందోళన చేస్తున్న విద్యార్థుల వద్దకు వచ్చి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

భారత్ విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) ఆంధ్ర యూనివర్సిటీ కమిటీ కార్యదర్శి డి.వెంకటరమణ, సహాయ కార్యదర్శి జి.అజయ్ హాస్టల్ విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల్ని రిజిస్ట్రార్ దృష్టికి తీసుకొచ్చారు. స్కాలర్‌షిప్‌లు రాకపోవటంతో హాస్టల్ నిర్వహణ వ్యయం విద్యార్థులపై వేయటం సరికాదన్నారు. ప్రైవేట్ హాస్టల్ మాదిరి డబ్బులు కడితేనే భోజనం పెడతామని చెబుతున్నారని, దీని వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. మెస్ చార్జీలు ఇష్టానుసారంగా పెంచేస్తున్నారని ఆక్షేపించారు. హాస్టల్‌లో మౌలిక సౌకర్యాలు పెంపొందించకున్నా, విద్యార్థుల నుంచి అభివృద్ధి ఫండ్(హెచ్‌డీఎఫ్) పేరుతో రూ.750లు వసూలు చేస్తున్నారని, కరెంట్ చార్జీలు కూడా విద్యార్థులపైనే వేస్తున్నారని పేర్కొన్నారు. స్కాలర్‌షిప్‌లతో వర్సిటీ హాస్టళ్లలో చదువుకుంటున్న విద్యార్థులు ఈ ఆర్థిక భారాన్ని మోయలేకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలపై చర్చించి, కొద్ది రోజుల్లోనే పరిష్కరిస్తామని రిజిస్ట్రార్ ధనుంజయరావు హామీ ఇవ్వటంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.సాయి తదితరులు పాల్గొన్నారు.

అర్జీల రీ ఓపెన్‌పై ఆగ్రహం

- పీజీఆర్‌ఎస్‌కు 237 అర్జీలు
- సమస్యలను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశం


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: జిల్లాలో 165 రీ ఓపెన్ అర్జీలు రావడంతో కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అర్జీదారులతో స్వయంగా మాట్లాడి కచ్చితమైన సమాచారాన్ని అందించి, ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అర్జీ పునరావృతమైతే సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను 24 గంటల్లోపు ఓపెన్ చేసి, పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి, సంతృప్తికరమైన పరిష్కారం చూపాలని ఆదేశించారు. 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌తో పాటు జేసీ మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ వర్మ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వీటిని సంబంధిత అధికారులకు రిఫర్ చేశారు. సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 237 వినతులు అందగా..రెవెన్యూ శాఖకు చెందినవి 76, పోలీసు శాఖకు సంబంధించి 15, జీవీఎంసీకి సంబంధించి 65 ఉన్నాయి. ఇతర విభాగాలకు సంబంధించి 81 వినతులు వచ్చాయి.

అధికారులకు కలెక్టర్ అభినందన

జిల్లాలో ప్రధాని నరేంద్ర మోదీ, సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ పర్యటన, సౌత్ జోన్–2 జ్యుడీషియల్ కాన్ఫరెన్స్‌లను నిర్వహించడంలో కీలకంగా వ్యవహరించిన అధికార యంత్రాంగాన్ని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అభినందించారు.

పింఛను కోసం దివ్యాంగురాలి వేదన


అర్జీ సమర్పించేందుకు కలెక్టరేట్‌కు కుమార్తె సత్యవతిని తీసుకొస్తున్న రమణమ్మ

మహారాణిపేట: సరిగా నిలబడలేదు..నోరు విప్పి మాట్లాడలేదు..చివరికి ఆహారం కూడా తినలేని పరిస్థితి. జన్యు పరమైన సమస్యతో ఆమె మానసిక దివ్యాంగురాలిగా జీవనం గడుపుతోంది. పెళ్లై..ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. ఈమె మానసిక పరిస్థితి చూసి భర్త విడిచి వెళ్లిపోయాడు. దీంతో ఆమె తల్లి చేరదీసింది. మానసిక దివ్యాంగురాలైన తన బిడ్డకు పింఛను ఇప్పించండి మహాప్రభో అంటూ కాళ్లరిగేలా తిరుగుతోంది. గోపాలపట్నం ఆర్.ఆర్.వెంకటాపురం నందమూరినగర్‌లో ఉంటున్న మద్ది సత్యవతి..మానసిక దివ్యాంగురాలు. ప్రస్తుతం తల్లి కొయ్యన రమణమ్మ దగ్గర తన ఇద్దరి పిల్లలతో ఉంటుంది. రమణమ్మకు వచ్చే పింఛన్‌తోనే వీరు జీవిస్తున్నారు. మానసిక దివ్యాంగురాలైన తన కుమార్తెకు వైద్యులు ఇచ్చిన సర్టిఫికెట్‌తోపాటు, సదరం సర్టిఫికెట్ కూడా ఉందని, పింఛను మాత్రం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీ సమర్పించేందుకు సత్యవతి, ఆమె పిల్లలను వెంటబెట్టుకుని రమణమ్మ కలెక్టరేట్‌కు వచ్చింది. పింఛను ఇచ్చి ఆదుకోవాలని వేడుకుంది.

పింఛను తీసేస్తారేమోనని ఆందోళనతో..


కలెక్టర్‌కు అర్జీ సమర్పించి వస్తున్న దివ్యాంగుడు

తన కుమారుడు దివ్యాంగుడు. సర్వే పేరుతో అధికారులు ఇంటికి వచ్చి వివరాలు అడిగారు. చాలా మంది దివ్యాంగుల పెన్షన్లు తీసేస్తున్నారని ప్రచారం జరుగుతోంది. ఆ ఆందోళనతోనే బాధితుడు కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు వినతి పత్రం సమర్పించాడు. గొల్లలపాలెంకు చెందిన దివ్యాంగుడు శ్రీనివాస్..తన తండ్రి అప్పారావు సాయంతో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వచ్చాడు. ఎప్పటినుంచో దివ్యాంగుల పెన్షన్ వస్తోందని, అయితే సర్వే పేరుతో పింఛన్ల కోత విధిస్తున్నారంటూ ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లామని అప్పారావు చెప్పారు.

ప్రజా పరిష్కారవేదికకు 92 వినతులు


అర్జీదారుడి సమస్య వింటున్న కమిషనర్ సంపత్‌కుమార్

డాబాగార్డెన్స్: ప్రజా పరిష్కార వేదికకు 92 వినతులు అందినట్టు నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో కమిషనర్ సంపత్ కుమార్‌తో కలిసి అర్జీలను స్వీకరించారు. జోన్–2 నుంచి 12, జోన్–3 నుంచి 13, జోన్–4 నుంచి 11, జోన్–5 నుంచి 16, జోన్–6 నుంచి 10, జోన్–7 నుంచి ఒకటి, జోన్–8 నుంచి 10 ఫిర్యాదులు అందగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి సంబంధించి 19 ఫిర్యాదులు అందాయని మేయర్ తెలిపారు. మొత్తం వినతుల్లో పట్టణ ప్రణాళికా విభాగానికి చెందినవే 45 ఉండడం గమనార్హం.

- అక్కయ్యపాలెం 80 ఫీట్ రోడ్డు సమీపంలో ప్రధాన గెడ్డ ఉంది. గెడ్డను ఆక్రమించి ఎటువంటి సెట్‌బ్యాక్స్ లేకుండా ఓ వ్యక్తి భవనం నిర్మిస్తున్నాడు. దీనివల్ల వర్షాకాలంలో పెద్ద ఎత్తున దిగువ ఉన్న ప్రాంతాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది..దీనిపై చర్యలు చేపట్టాలని ఆ ప్రాంతానికి చెందిన వెంకటరావు వినతి పత్రం అందజేశాడు.
- మధురవాడ టీచర్స్ కో ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీలో లే అవుట్ సుమారు 55 ఎకరాలు. ఎల్‌పీ నంబరు 2/85, రివైజ్డ్ నంబరు 70/87. లేఅవుట్‌లో 2 వేల గజాల స్థలాన్ని పార్కింగ్ కోసం విడిచిపెట్టాం. ప్రస్తుతం దానిని వేరే వ్యక్తి కబ్జాకు పాల్పడతున్నాడు. ఈ విషయమై గత నెల 16న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశా. సిబ్బంది వచ్చి లే అవుట్ ప్లాన్ అడిగారు. చూపించా.. లే అవుట్‌లో కబ్జాకు పాల్పడడమే గాక వేసిన షెడ్డు తొలగించాలని వేడుకుంటే..వచ్చిన సిబ్బంది పట్టించుకోకుండా వెళ్లిపోయారు. ఇదే విషయాన్ని గత నెల 30న వీఎంఆర్‌డీఏకి ఫిర్యాదు కూడా చేశాను. మాకు న్యాయం చేసి కబ్జాకు పాల్పడుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని మధురవాడ టీచర్స్ కో ఆపరేటీవ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ ఎస్ఎస్ విజయ రాఘవన్ వినతిపత్రం అందజేశారు.
- మధురవాడలోని సర్వే నంబరు 281/8,9,10 షిప్‌యార్డ్ లే అవుట్, వుడా లే అవుట్. ఎల్‌పీ నంబరు 24/94 ప్రకారం పార్కుగా గుర్తించారు. ఆ స్థలంలో అనధికారికంగా 2 రేకుల షెడ్డులు వెలిశాయి. వాటిని తొలగించాలని పలు మార్లు వినతి పత్రం అందజేశాం. వీఎంఆర్‌డీఏలో కూడా ఫిర్యాదు చేశాం. మా వినతిపై మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, గ్రామ రెవెన్యూ అధికారులు క్షేత్ర స్థాయి విచారణ చేపట్టారు. ఆ స్థలం పార్కుదని తేల్చారు. అయినప్పటికీ జీవీఎంసీ జోన్–2 అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఆ ప్రాంత వాసి సాగర్ అర్జీ సమర్పించాడు.

త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలి


ఫిర్యాదులు స్వీకరిస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ విశ్వనాథన్

విశాఖ సిటీ: ప్రజాదర్బార్‌లో వచ్చే ఫిర్యాదులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమానికి 21 ఫిర్యాదులు వచ్చాయి. అనంతరం మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్‌తో కలిసి అర్జీల పరిష్కారంపై సమీక్షించారు. ఇప్పటి వరకు వచ్చిన ఫిర్యాదుల్లో విభాగాల వారీగా ఎన్ని పరిష్కారమయ్యాయని తెలుసుకున్నారు. ప్రజాదర్బార్‌లో వచ్చే ఫిర్యాదులను పరిష్కరిస్తేనే సంస్థపై ప్రజల్లో నమ్మకం పెరుగుతుందని తెలిపారు. అలాగే ఫిర్యాదుదారుడికి నిర్దిష్ట కాల పరిమితిలో సమాధానం ఇచ్చే విధంగా ఉద్యోగులు బాధ్యత వహించాలని సూచించారు. మెట్రోపాలిటన్ కమిషనర్ విశ్వనాథన్ మాట్లాడుతూ అర్జీదారులు పలు మార్లు సంస్థ సంస్థ చుట్టూ తిరగకుండా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ కె.రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, ఎస్టేట్ అధికారి దయానిధి, చీఫ్ ఇంజనీర్ భవానీశంకర్, సీయూపీ శిల్ప, చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ హరిప్రసాద్, డీఎఫ్ఓ శివాని, ల్యాండ్ అక్విజిషన్ అధికారి వేణుగోపాల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వద్దు


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వహించవద్దని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 103 ఫిర్యాదులు వచ్చాయి. సీపీ ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వాటిపై వెంటనే సంబంధిత స్టేషన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి సత్వరమే పరిష్కరించాలని చెప్పారు.

ఐఎంయూ వద్ద కొనసాగుతున్న నిర్వాసితుల ఆందోళన


విశ్వవిద్యాలయం ఎదురుగా నిరసన తెలియజేస్తున్న గ్రామస్తులు, నిర్వాసిత రైతులు

సబ్బవరం: మండలంలోని వంగలి గ్రామంలో ఉన్న ఇండియన్ మారిటైం విశ్వవిద్యాలయంలో స్థానికులకు, భూ నిర్వాసిత రైతులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరసన కార్యక్రమం మూడో రోజు సోమవారం కొనసాగింది. భూ నిర్వాసిత రైతులు, వంగలి గ్రామస్తులు తమ డిమాండ్లకు సాధనకు విశ్వవిద్యాలయం ఎదుట శనివారం ధర్నా, రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఆందోళనకారులకు, యాజమాన్యం మధ్య చర్చలు విఫలమవడంతో నిరసన కొనసాగిస్తున్నారు. మూడోరోజు సోమవారం రైతులు, గ్రామస్తులు సుమారు 500 మంది వరకూ దీక్ష స్థలికి చేరుకొన్నారు. యథావిధిగా దీక్షను కొనసాగిస్తుండడంతో విశ్వవిద్యాలయంలో కార్యకలాపాలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఇదిలావుండగా పెందుర్తిలోని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు సమక్షంలో గ్రామస్తులు, విశ్వవిద్యాలయం ప్రతినిధులతో చర్చలు జరిగాయని ప్రచారం జరుగుతోంది. కొన్ని డిమాండ్లను అంగీకరించినప్పటికీ లిఖిత పూర్వకంగా హామీ లభించకపోవడంతో ఆందోళన కొనసాగించేందుకు గ్రామస్తులు నిర్ణయించుకున్నారు. రైతులు పెద్ద ఎత్తున ప్లకార్డులతో నినాదాలు చేశారు. మూడో రోజు ఆందోళనలో సర్పంచ్ ఆకుల శ్రీహేమతోపాటు నాయకులు ఆకుల గణేష్, జెట్టి ప్రసాద్, జెట్టి ముత్యాలనాయుడు, గొర్లి అప్పలనాయుడు, జెట్టి శ్రీను,జెట్టి నరసింగరరావు,గవర అప్పలనాయుడు,ముమ్మిణ అప్పలరాజు,యర్ర సతీష్, గవర గాయిత్రీ, జెట్టి హేమంత్, కోన కొండబాబు, జెట్టి సోమేష్‌తో పాటు భూ నిర్వాసిత రైతులు, అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తహసీల్దార్ చిన్నికృష్ణ, సీఐ రమణ సోమవారం వర్సిటీ చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. గ్రామస్తులు, నిర్వాసితుల డిమాండ్లను కలెక్టర్ దృష్టికి తీసుకువెళతామని తహసీల్దార్ చిన్నికృష్ణ తెలిపారు. సీఐ రమణ మాట్లాడుతూ వర్సిటీ వద్ద తనతో పాటు మరో సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐ దివ్యతో పాటు 20 మంది వరకూ ఆర్మ్‌డ్ ఫోర్స్, మరో 25 మంది వరకూ సివిల్ ఫోర్స్ పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు.

రేపు ఉమ్మడి విశాఖ కబడ్డీ జట్ల ఎంపిక

గాజువాక: 71వ అంతర్ జిల్లాల మహిళా, పురుషుల కబడ్డీ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి విశాఖ జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక ఈనెల 22వ తేదీ గాజువాక హైస్కూల్‌లో నిర్వహించనున్నట్టు ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి ఉరుకూటి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పి.కోటేశ్వరరావు తెలిపారు. ఈనెల 25 నుంచి మూడు రోజుల పాటు అనకాపల్లి జిల్లా అనుకుపాలెం గ్రామంలో పోటీలు నిర్వహించనున్నారని చెప్పారు. పురుషులు 85 కిలోలు, మహిళలు 75 కేజీలలోపు బరువు ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు 22వ తేదీ మధ్యాహ్నం 2 గంటలలోగా సంప్రదించాలని వారు తెలిపారు. వివరాలకు 76800 05666, 98856 98717 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

బ్రాయిలర్ (లైవ్)	: రూ.145
స్కిన్	: రూ.260
స్కిన్‌లెస్	: రూ.270

గృహిణులకు స్పోకెన్ ఇంగ్లిష్‌లో ఉచిత శిక్షణ

సీతంపేట: గృహిణులకు స్పోకెన్ ఇంగ్లిష్‌లో రెండు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు గృహిణి స్పోకెన్ ఇంగ్లిష్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు దామోదర మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. రామాటాకీస్ సమీపంలో కెనరా బ్యాంకు ఎదురుగా శ్రీకృష్ణా ట్రావెల్స్ మేడపైన ఉన్న సంస్థ కార్యాలయంలో ఈనెల 23 నుంచి మార్చి 23 వరకు ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు శిక్షణ తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి గల గృహిణులు ఇనిస్టిట్యూట్‌కి వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 80193 88999 ఫోన్ నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

అశోక్‌నగర్ స్టేషన్‌లో ప్రయోగాత్మక హాల్ట్

తాటిచెట్లపాలెం: వెస్ట్ సెంట్రల్ రైల్వే, భోపాల్ డివిజన్ పరిధిలోని అశోక్‌నగర్ స్టేషన్‌లో విశాఖ–భగత్‌కికోటి–విశాఖ వీక్లీ ఎక్స్‌ప్రెస్‌కు ప్రయోగాత్మక హాల్ట్ ఇస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు. విశాఖ–భగత్‌కి కోటి (18573) వీక్లీ ఎక్స్‌ప్రెస్‌కు జూలై 15వ తేదీ వరకు హాల్ట్ అశోక్‌నగర్‌లో హాల్ట్ కల్పిస్తున్నామన్నారు. ఈ రైలు ఆయా రోజుల్లో తెల్లవారు 4.28 గంటలకు అశోక్‌నగర్ చేరుకుని, అక్కడ నుంచి 4.30గంటలకు బయల్దేరుతుంది. తిరుగు ప్రయాణంలో భగత్ కి కోటి–విశాఖ(18574) వీక్లీ ఎక్స్‌ప్రెస్‌కు జూలై 10వ తేదీ వరకు హాల్ట్ సౌకర్యం కల్పించామన్నారు. ఈనెల 25వ తేదీన పాదనూర్‌లో బయల్దేరే పాదనూర్–బరౌని (06055)స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రాంచీ డివిజన్‌లో మళ్లించిన మార్గంలో వయా రూర్కెలా, సిని, చందిల్, మూరి, కొట్‌శిల మీదుగా నడుస్తుంది.

జీతాలు చెల్లించాలని గెస్ట్ ఫ్యాకల్టీల ఆందోళన

మహారాణిపేట: ఐదు నెలలుగా బకాయి పడ్డ జీతాలు చెల్లించాలని అధ్యాపకులు ఆందోళనకు దిగారు. విశాఖ జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాల గెస్టు ఫ్యాకల్టీ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్‌కు సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు జి.రమేష్ మాట్లాడుతూ జిల్లాలో 46 మంది గెస్టు ఫ్యాకల్టీలకు ఐదు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదన్నారు. జీతాలు చెల్లించకపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రధాన కార్యదర్శి ఆర్.మహాదేవ్ పేర్కొన్నారు.



చేయి పట్టి నడిపించడమే కాదు లోకాన్ని ఎదుర్కోవడం నేర్పించేది నాన్న.. మనం ఒక్కో మెట్టు ఎక్కుతుంటే తానే ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించినంత ఆనందం పొందుతాడు. మన ఎదుగుదలలో.. మన జీవితంలో ముఖ్యపాత్ర పోషిస్తాడు.. ఇదుగో బీచ్‌రోడ్డులో ఆదివారం సంధ్యా సమయంలో తమ కుమారుడికి గాలి పటం ఎలా ఎగురవేయాలో దగ్గరుండి తండ్రి నేర్పించాడు. ఈ సుందర దృశ్యం చెప్పకనే ఎన్నో జీవిత పాఠాలను ఆవిష్కరిస్తోంది. ఫొటో: సాక్షి, ఫొటోగ్రాఫర్

మేయర్ ఇలా..అధికారులు అలా..


ఆర్‌టీసీ బస్సులో క్యాంపు కార్యాలయం నుంచి జీవీఎంసీకి చేరుకున్న మేయర్ హరి వెంకటకుమారి


జీవీఎంసీ వాహనం నుంచి దిగుతున్న మెకానికల్ ఈఈ చిరంజీవి


జీవీఎంసీ వాహనం దిగి కార్యాలయంలోకి వెళ్తున్న హార్టీకల్చర్ అధికారి దామోదరరావు


వాహనం దిగి కార్యాలయంలోకి వెళుతున్న ఎఫ్ అండ్ ఏఓ మల్లికాంబ

డాబాగార్డెన్స్: కాలుష్య రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దుదామని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి కంకణం కట్టుకున్నారు. అందుకు ప్రతి సోమవారం వ్యక్తిగత వాహనాలు వీడి ప్రజా రవాణాను వినియోగిస్తున్నారు. జీవీఎంసీ అధికారులు కూడా ఇలాగే రావాలని నిర్ణయించుకున్నారు. అయితే మేయర్ హరి వెంకటకుమారి మాత్రం మాట తప్పకుండా ప్రతి సోమవారం ఆర్టీసీ బస్సులోనే జీవీఎంసీకి చేరుకుంటున్నారు. అధికారులు మాత్రం వ్యక్తిగత వాహనాలు వీడడం లేదు. ప్రతి సోమవారం జీవీఎంసీ వాహనంలో ఇంటి నుంచి బయలుదేరి జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి చేరుకుంటున్నారు. గేట్ ముందు వాహనం దిగి..ప్రధాన కార్యాలయం లోపలికి నడుచుకుంటూ విధులకు హాజరవుతున్నారు. తామంతా వ్యక్తిగత వాహనాల్లో రావడం లేదని బిల్డప్ ఇస్తూ ఇలా నాలుగు అడుగులు నడుస్తున్నారు. ఇది చూసిన జనం మాత్రం నవ్వుకుంటున్నారు.

విద్యుదాఘాతంతో కాంట్రాక్ట్ కార్మికుడి మృతి


మహ్మద్ గౌస్ (ఫైల్)

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లోని ఈస్ట్‌కోస్ట్ రైల్వే లైన్‌లో విద్యుత్ షాక్‌తో కాంట్రాక్ట్ కార్మికుడు మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. ఇస్లాంపేటకు చెందిన మహ్మద్ గౌస్ (36).. స్టీల్‌ప్లాంట్‌లోని రైల్వేకు చెందిన సురభీ ఎంటర్‌ప్రైజెస్‌లో కాంట్రాక్ట్ కార్మికుడుగా పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి షిఫ్ట్ డ్యూటీకు వెళ్లాడు. సోమవారం ఉదయం విధి నిర్వహణలో భాగంగా సహ కార్మికుడు ఆలీతో ట్రాక్‌పై ఉన్న ట్యాంకర్‌కు ఇరువైపులా ఎయిర్ రిలీజ్ పనులు చేస్తున్నారు. రెండు బోగీలు అవతల పెద్ద శబ్దం వచ్చింది. భయంతో వెనక్కి వచ్చి చూడగా..గౌస్ ట్రాక్‌పై తీవ్ర గాయాలతో పడి ఉన్నాడు. ట్యాంకర్‌పై ఉన్న విద్యుత్ లైన్లు తగలడం వల్ల విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. వెంటనే అధికారులకు ఆలీ సమాచారం అందించటంతో వారు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అనంతరం స్టీల్‌ప్లాంట్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ తాతారావు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తాతారావు చెప్పారు.



మాది ఫినిష్.. ఇక మీదే వేట

పొగ మంచు దుప్పటి కప్పుకొని కడలి సేదతీరుతుండగా.. వేట ముగించుకొని గూటికి చేరుకునేందుకు కొంగలు రివ్వున దూసుకు పోతున్నాయి. మరోవైపు అప్పుడే తెర పడవలో మత్స్యకారులు వేటకు బయలుదేరిన దృశ్యం తొట్లకొండ సమీపంలో కనిపించింది.

–ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

డ్రైవర్ నిర్లక్ష్యంతో వృద్ధురాలి మృతి

మధురవాడ: ఆర్టీసీ బస్ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా కార్‌షెడ్ జంక్షన్ వద్ద సోమవారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో డోని సావిత్రి (80) అనే వృద్ధురాలు మృతి చెందింది. పీఎం పాలెం పోలీసులు తెలిపిన వివరాలివి.. ఐఏఆర్‌ఎంలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న బుజ్జి.. భార్య, తల్లి, ఇతర కుటుంబ సభ్యులతో భీమునిపట్నం ఎగువపేటలో నివసిస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం బుజ్జి భార్య రాజేశ్వరి, సోదరుడు మధు, తల్లి సావిత్రితో కలిసి బక్కన్నపాలెంలో ఉంటున్న బంధువుల ఇంటికి బయల్దేరారు. ఈ క్రమంలో భీమిలిలో ఆర్టీసీ బస్సు ఎక్కి మధ్యాహ్నం ఒంటిగంట సమయానికి కార్‌షెడ్ జంక్షన్ వద్దకు చేరుకున్నారు. సిగ్నల్ వద్ద ముందుగా బుజ్జి ఆయన భార్య, సోదరుడు బస్ దిగారు. సావిత్రి బస్ దిగుతున్న క్రమంలో డ్రైవర్ బస్సు నడపడంతో ఆమె రోడ్డుపై పడిపోయింది. ఆమె కాళ్లపై నుంచి బస్సు వెళ్లిపోవడంతో తీవ్రంగా రక్త స్రావమై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కుమారుడు బుజ్జి ఫిర్యాదు మేరకు పీఎం పాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సముద్రంలో విహరించాలని ఎవరికి ఉండదు..పైగా అందమైన రుషికొండ బీచ్‌లో బోటుపై షికారుకు వెళితే ఆ మజా వేరు..స్పీడ్ బోటుపై దూసుకుపోతే ఆ కిక్కే వేరు..అందుకే రుషికొండ బీచ్‌కు వెళ్లినవారు కచ్చితంగా ఒక్కసారైనా స్పీడ్ బోటుపై విహరించాలని కోరుకుంటారు. సోమవారం పలువురు పర్యాటకులు ఇలా స్పీడ్ బోట్‌పై రయ్‌మంటూ దూసుకుపోయారు.

–ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం